క్లుప్తంగా

నేడు ఐదు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

యడ్లపాడు: మండలానికి చెందిన పలు గ్రామాల్లో శుక్రవారం లైన్ల మరమ్మతు పనుల నేపథ్యంలో విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు చిలకలూరిపేట ట్రాన్స్‌కో డీఈఈ ఆర్.అశోక్‌కుమార్ తెలిపారు. కొండవీడు, పుట్టకోట, సొలస, లింగారావుపాలెం, చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని వివరించారు. ఈ మేరకు విద్యుత్ వినియోగదారులు అధికారులతో సహకరించాలని తెలియజేశారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

చిలకలూరిపేట: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని తెలిపారు. మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో నిర్వహించే ఈ సమావేశానికి కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు హాజరుకావాలని కోరారు.

వైద్య ఆరోగ్య సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలి

శావల్యాపురం: గ్రామీణ ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది తమ విధులు బాధ్యతగా నిర్వహించాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్ అన్నారు. గురువారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో వైద్య ఆరోగ్య సిబ్బందితో ప్రభుత్వ పథకాలు పురోగతి అన్‌లైన్ నమోదు ప్రక్రియలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సారథ్యంలో నిర్వహిస్తున్న ఆరోగ్య సర్వేల పురోగతి వేగవంతం చేయాలన్నారు. అలాగే గర్భిణులు, నమోదు, తట్టు, రూబెల్లా తదితర వ్యాధులు రాకుండా సకాలంలో టీకాలు చిన్నారులకు చేయాలన్నారు. 70 సంవత్సరాల నిండిన వయోవృద్ధుల సమగ్ర వివరాలు సేకరించి అన్‌లైన్‌లో నమోదు చేయటం ద్వారా రూ. 5 లక్షల వరకు ఆరోగ్యశ్రీ పథకం వర్తించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన పథకంలో లబ్ధి పొందే వారందరి ఈకేవైసీ నమోదు చేయాలన్నారు. వైద్యాధికారి రావిపూడి రమ్య, సూపర్‌వైజర్లు అలవలపూడి ఏడుకొండలు, ఉమాదేవి ఉన్నారు.

మహా సభలను జయప్రదం చేయండి

రొంపిచర్ల: నియోజకవర్గ సీపీఐ మహాసభలను జయప్రదం చేయాలంటూ గురువారం మండలంలో కరపత్రాలు పంపిణీ చేశారు. మండల కేంద్రమైన రొంపిచర్లలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికోసం, ఇండ్ల స్థలాల కోసం, అనేక కాలనీల నిర్మాణం కోసం సీపీఐ నిరంతరం పోరాటం చేసి సాధించిందని అన్నారు.

సుబాబుల్ పంట నరికివేత

నరసరావుపేట రూరల్: పొలంలోకి అక్రమంగా ప్రవేశించి సుబాబుల్ పంటను తొలగిస్తున్న వారిని ప్రశ్నించినందుకు తనపై కత్తులతో హత్యాయత్నానికి ప్రయత్నించినట్టు రెడ్డినగర్‌కు చెందిన వెన్నా మాధవి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. రావిపాడు పంచాయతీ పరిధిలోని ఆదిత్య వెంచర్‌లో నాకు 2.10 ఎకరాల భూమి ఉందని, ఈ భూమిలో మూడు సంవత్సరాల క్రితం సుబాబుల్ పంటను వేసినట్టు ఫిర్యాదులో తెలిపారు. పంటను చూసేందుకు గురువారం సాయంత్రం 4గంటలకు నా బంధువైన వెన్నా రాజశేఖరరెడ్డితో కలిసి వెళ్లగా మిషన్‌తో సుబాబుల్‌ను తొలగిస్తున్నారని పేర్కొన్నారు. ఈ భూమికి సమీపంలో రామిరెడ్డిపేటకు చెందిన కోటపాటి సాయికృష్ణ ఇళ్లను నిర్మిస్తున్నాడు. ఈ నిర్మాణాలకు అడ్డుగా ఉందను కారణంతో సుబాబుల్ తోటను తొలగిస్తున్నారని తెలిపారు. సుబాబుల్‌ను తొలగించడాన్ని ప్రశ్నించిన తమను హత్యచేసేందుకు సాయికృష్ణతో పాటు మరికొందరు కత్తులతో ప్రయత్నించినట్టు ఫిర్యాదులో వివరించారు. ఫిర్యాదుపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్ఐ కిషోర్ తెలిపారు.

పురపాలక పరిధిలో పూడిక తీత పనులు

నరసరావుపేట: పురపాలక పరిధిలోని 34 వార్డుల్లో డ్రెయిన్లలో పూడిక పనులు నిర్వహించేందుకు రూ.40 లక్షలతో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించామని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు పేర్కొన్నారు. గురువారం రెండోవార్డులో నిర్వహిస్తున్న కాలువ తీత పనులను పర్యవేక్షించారు. కత్తవ చెరువు, డ్రైన్ క్లీనింగ్ పనులను స్వయంగా పరిశీలించారు.

పని ఒత్తిడి తగ్గించాలి

నరసరావుపేట: సచివాలయ ఉద్యోగులకు పని ఒత్తిడి తగ్గించి వారి ఆత్మహత్యలను నివారించాలని గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు స్టేట్‌మీడియా కోఆర్డినేటర్ షేక్ మహమద్ అలీ, జిల్లా జాయింట్ సెక్రటరీ విజయలక్ష్మి, అదనపు ప్రధాన కార్యదర్శి షేక్ కరిముల్లా, ఇసి మెంబర్ పి.రమేష్‌లు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పని ఒత్తిడికారణంగా బుధవారం ఏలూరులో ఏఎస్‌ఎం కల్యాణి గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకుందన్నారు. ఈనెల మొదటివారం రేపల్లెలో ఏఎస్‌ఎం సింగటి కోటేశ్వరమ్మ, ఐదు నెలల క్రితం జంబులదిన్నె సచివాలయంలో అగ్రికల్చరల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న హరినాథరెడ్డి ఉరివేసుకొని అకాల మరణం పొందారన్నారు. ఇలాంటి వరుస సంఘటనలతో సచివాలయ ఉద్యోగుల్లో ఆందోళన నెలకొందన్నారు.



మహానేత డాక్టర్ వైఎస్సార్ ఆవిష్కరించిన పైలాన్



పార్కులో నిర్మించిన ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకు

సెలక్షన్ గ్రేడ్ పురపాలక సంఘంగా... నరసరావుపేట

- 1915 నుంచి ప్రారంభమైన పురపాలక సంఘం
- 1960లో గ్రేడు-2 మున్సిపాల్టీ నుంచి 65 ఏళ్లకు సెలక్షన్ గ్రేడ్‌గా మార్పు



పురపాలకసంఘ ప్రధాన ద్వారం

నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావుపేట పురపాలక సంఘానికి సముచిత గౌరవం దక్కింది. పురపాలక సంఘాన్ని సెలక్షన్ గ్రేడ్‌గా గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం జీవో 88ను జారీ చేసింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2022లో పల్నాడు జిల్లాకు నరసరావు పేటను జిల్లా కేంద్రంగా చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిన విషయం విదితమే. 2011 జనాభా లెక్కల ప్రకారం పురపాలక జనాభా 1.17 లక్షలు ఉండగా గత 14 ఏళ్లలో ప్రస్తుతం రమారమిగా 1.60 లక్షల వరకు ఉంది. 1915లో నరసరావుపేట పట్టణాన్ని తొలిసారిగా పురపాలక సంఘంగా గుర్తించారు. 1960లో సెకెండ్ గ్రేడ్ మున్సిపాల్టీగా ఉన్న నరసరావుపేట ఇప్పటివరకు గ్రేడ్-1 కొనసాగింది. ఆ తర్వాతి స్థానమైన స్పెషల్ గ్రేడ్‌ను అధిగమించి ఇప్పుడు సెలక్షన్ గ్రేడ్ చేశారు. 1966లో తొలిసారిగా పట్టణ ప్రజలకు శాంతినగర్‌లో రిజర్వాయర్ నిర్మించి తాగునీటి కుళాయి వసతిని కల్పించారు. 1997లో పట్టణ ద్విశతాబ్ది ఉత్సవాలను నిర్వహించి ప్రధాన వీధులను విస్తృతపర్చారు. 2002లో టౌన్‌హాలుతో పాటు పట్టణ ప్రజలకు అవసరమైన తాగునీటి అవసరాలకోసం నకరికల్లులో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణం, మల్లమ్మ సెంటర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేశారు. 2004 నుంచి 2014లోగా పట్టణ పురవీధులన్నీ సీసీ రోడ్లుగా మార్చారు. చిలకలూరిపేటరోడ్డు రైల్వే గేటు వద్ద రైల్వేఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేశారు. దీంతో పట్టణ ప్రజలకు రెండో ఫ్లైఓవర్ రోడ్డు దక్కింది. 2006లో నగరబాట సందర్భంగా నరసరావుపేటకు వచ్చిన అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పట్టణ నడిబొడ్డున రూ.70 కోట్లతో చేసిన పనులకు గుర్తుగా పైలాన్ ఆవిష్కరించారు. 2015లో వందేళ్ల శతాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ఇప్పుడు 34 వార్డులుగా ఉన్న పురపాలక సంఘానికి చుట్టుపక్కల ఉన్న ఐదు పంచాయతీలను కలిపి 38 వార్డులుగా విభజించాలనే ప్రతిపాదన చేశారు. 2014లో చివరిసారిగా పురపాలక సంఘానికి ఎన్నికలు నిర్వహించారు. ఇప్పుడు సెలక్షన్ గ్రేడ్‌గా మార్చటం వలన అధికారుల పోస్టులు పెరగనున్నాయి. ఇప్పుడు ఇంజినీరింగ్ విభాగంలో ఇద్దరే ఏఈలు ఉండగా ఆరుగురు ఏఈలు, ఒక డీఇ నుంచి ముగ్గురు డీఇలకు పోస్టులు పెరగనున్నాయి.

అలాగే పట్టణ ప్రణాళికా విభాగంలో టీపీఓలు ఇద్దరు ఉండగా వారికంటే అసిస్టెంట్ కమిషనర్ స్థాయి వ్యక్తి ఆధ్వర్యంలో ప్రణాళికా విభాగం నడిచే అవకాశం ఉంది. ఈ పురపాలక సంఘానికి సెలక్షన్ గ్రేడ్ కమిషనర్ మాత్రమే రావాల్సి ఉండగా ఇప్పటికే అదే గ్రేడ్‌లో ఉన్న కమిషనర్ ఎం.జస్వంతరావు కొనసాగుతున్నారు.

నిధులు, అధికారులు పెరిగే అవకాశం ఉంది



పురపాలకస్థాయిని సెలక్షన్ గ్రేడ్‌గా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంట్స్‌లో గ్రేడ్ ప్రాధాన్యతను బట్టి నిధులు ఎక్కువగా కేటాయిస్తారు. కమిషనర్‌కు ఇప్పటివరకు రూ.1 లక్ష వరకు మాత్రమే ఖర్చుచేసే అవకాశం ఉండగా సెలక్షన్ గ్రేడ్ వలన రూ.5లక్షల వరకు ఖర్చుచేసే అవకాశం ఉంటుంది. అంతేగాకుండా ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళికా విభాగాల్లో అధికారులు పెరుగుతారు. దీని వలన పురపాలక కార్యకలాపాలపై నిఘా పెరుగుతుంది.

––ఎం.జస్వంతరావు, కమిషనర్

వినియోగదారులు ప్రశ్నించే హక్కు కలిగి ఉండాలి



పెట్రోల్ కొనుగోలు జాగ్రత్తలపై కరపత్రం పంపిణీ చేస్తున్న ఫోరం సభ్యులు

చిలకలూరిపేట: కొనుగోలు చేసే వస్తువుల నాణ్యత, ధరలను ప్రశ్నించే హక్కు వినియోగదారులకు ఉంటుందని వినియోగదారుల హక్కుల పరిరక్షణ ఫోరం అధ్యక్షుడు మురికిపూడి ప్రసాద్ చెప్పారు. ఫోరం ఆధ్వర్యంలో పెట్రోల్ కొనుగోలు చేసినప్పుడు ఎలా తనిఖీ చేసుకోవాలో అనే విషయంపై పట్టణంలోని కేబీ రోడ్డులో అవగాహన కార్యక్రమం, కరపత్రాల పంపిణీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్రోల్ బంకులో పెట్రోలు, డీజిల్ కొనుగోలు చేసేటప్పుడు మీటర్ రీడింగ్ తప్పనిసరిగా చూసుకోవాలన్నారు. పెట్రోల్ నాణ్యతను పరీక్షించుకోవడం, బంకులో ఉండే ఇతర వసతులను తెలుసుకొని ఉపయోగించుకోవడం, ఏదైనా నష్టపోయామనుకుంటే ఎవరికి ఫిర్యాదు చేయాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫోరం ఉపాధ్యక్షుడు డాక్టర్ విద్యాసాగర్, కార్యదర్శి రవినాయక్, కోశాధికారి బేబి విక్రమ్, సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు సభ్యులు పాల్గొన్నారు.

రక్తదాతలు రండి.. ప్రాణదాతలు కండి

- పల్నాడు రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు
- కలెక్టర్ ఆదేశాలతో యడ్లపాడులో రక్తదానం శిబిరం ఏర్పాటు
- స్వచ్ఛందంగా 23 మంది రక్తదానం



కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి

యడ్లపాడు: తల్లి జన్మనిస్తే.. రక్తదాత పునర్జన్మను ఇస్తాడని రెడ్‌క్రాస్‌సొసైటీ చైర్మన్ డాక్టర్ కంజుల జగన్ మోహన్‌రెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన గురువారం మండల కేంద్రమైన యడ్లపాడులో రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ముందుకు శిబిరానికి హాజరైన ప్రజలకు రక్తదాన శిబిరాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని అయన పిలుపునిచ్చారు. ప్రతి మూడు మాసాలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని, రక్తదానం చేయడం వలన పాతకణాలు పోయి కొత్తవి జీవం పోసుకుంటాయన్న విషయాన్ని గ్రహించాలన్నారు. తద్వారా రక్తదాతలు చురుకుగా ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి రక్తం ఇచ్చేందుకు సుముఖంగా ఉంటే వారి వద్దకే వెళ్లి శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఉద్యోగులు, ప్రజలు స్వచ్ఛందంగా కదిలివచ్చిన రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ కె.జగన్‌మోహన్‌రెడ్డి, ట్రెజరర్ జి మురళీకృష్ణ, కోఆర్డినేటర్ పి.వెంకటేశ్వరరావు, సిబ్బంది కరుణ, ఎమ్మేలమ్మ, పాల్గొని తమ సేవలు అందించిన ఈ కార్యక్రమంలో యడ్లపాడు తహసీల్దార్ జెట్టి విజయశ్రీ, డీటీ అనురాధ, ఆర్ఐ ముప్పాళ్ల సుబ్బారావు, ఎంపీడీవో వి.హేమలతాదేవి పాల్గొన్నారు.

నాటకాన్ని బతికిద్దాం.. నటులను ప్రోత్సహిద్దాం

ముగిసిన జాతీయస్థాయి నాటికల పోటీలు



ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన

నాదెండ్ల: నాటకాన్ని బతికిద్దాం.. నటులు, రచయితలు, దర్శకులు, సాంకేతిక నిపుణులను ప్రోత్సహిద్దామంటూ పలువురు వక్తలు వ్యాఖ్యానించారు. పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం సాతులూరు గ్రామంలో ఎన్టీఆర్ కళాపరిషత్ తృతీయ జాతీయస్థాయి నాటిక పోటీలు బుధవారం రాత్రితో ముగిశాయి. గత ఐదు రోజులుగా జరుగుతున్న పోటీలు కళాప్రియులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సభాధ్యక్షుడిగా వజ్జా మధుసూధనరావు వ్యవహరించగా, ముఖ్యఅతిథులుగా సర్పంచ్ శోభారాణి, డాక్టర్ శరశ్చంద్ర, బొప్పన నరసింహారావు, చలసాని కృష్ణప్రసాద్, గరికపాటి వెంకటరావు, మానం వెంకటేశ్వర్లు, రామరాజు శ్రీనివాసరావు, అప్పసాని నాగమల్లేశ్వరరావు, ముప్ప శ్రీనివాసరావు, యార్లగడ్డ బుచ్చయ్యచౌదరి హాజరయ్యారు. ఈ సందర్భంగా అమృతవర్షిణి, సాయిసుప్రియలకు పురస్కారాలు అందించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ మూడేళ్లుగా కళాపరిషత్ ఆధ్వర్యంలో నాటికలు నిర్వహించటం అభినందనీయమన్నారు. లోటుపాట్లుంటే సవరించుకుని భవిష్యత్‌లో మరింత గొప్పగా నాటికల పోటీలు జరపాలని ఆకాంక్షించారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

తాడేపల్లి అరవింద ఆర్ట్స్ 'విడాకులు కావాలి' నాటికకు రచయితగా వల్లూరి శివప్రసాద్, దర్శకత్వం గంగోత్రి సాయి, తెనాలి అద్దేపల్లి ఆరాధ్యుల ఆర్ట్స్ 'ఎవరు' నాటికకు రచయితగా ఆరాధ్యుల తేజస్వీ ప్రఖ్య, దర్శకుడిగా అద్దేపల్లి లక్ష్మణ శాస్త్రి, కట్రపాడు ఉషోదయ కళానికేతన్ 'కిడ్నాప్' రచయిత, దర్శకత్వం చెరుకూరి సాంబశివరావు వహించారు. ఆయా నాటికలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం చిన్నారుల నృత్యప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమాలను కళాపరిషత్ నిర్వాహకులు నడింపల్లి వెంకటేశ్వరరావు, బండారుపల్లి సత్యనారాయణ, జరుగుల రామారావు, చెరుకూరి సాంబశివరావు పర్యవేక్షించారు.

రేషన్ షాపుల్లోనే నిత్యావసర సరుకులు

రొంపిచర్ల: మండలంలోని రేషన్ కార్డు దారులకు జూన్ నెల 1వ తేదీ నుంచి నిత్యావసర సరుకులను చౌకదరల దుకాణం వద్దనే పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ బి. నిర్మల తెలిపారు. ఎండీయూ వాహనాలను ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఈమేరకు జిల్లా కలెక్టర్ నుంచిఉత్తర్వులు వచ్చాయన్నారు.

చిరుమామిళ్ళ జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎం బదిలీ

నాదెండ్ల: చిరుమామిళ్ళ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మల్లవరపు సుందరరావు బదిలీ అయ్యారు. నరసరావుపేట మండలం ఉప్పలపాడు ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో చిలకలూరిపేట మండలం వేలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న మేకల కిషోర్‌బాబు బదిలీపై ఇక్కడకు రానున్నారు. జూన్ 1వ తేదీలోగా విధుల్లో చేరనున్నారు. మండల పరిధిలో 9 జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలుండగా, ఒక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మాత్రమే బదిలీ అయ్యారని ఎంఈవో ఈమని కృష్ణారెడ్డి తెలిపారు.

మోసం చేసిన కేసులో నిందితుడి అరెస్ట్

నరసరావుపేటటౌన్: రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగిని మోసం చేసిన కేసులో ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ హైమారావు గురు వారం తెలిపారు. వెంగళరెడ్డి కాలనీకు చెందిన సయ్యద్ ఉస్మాన్ ఆర్మీలో పనిచేస్తూ 2006లో ఉద్యోగ విరమణ పొందాడు. ఆ సమయంలో వచ్చిన నగదుతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆస్తులు కొన్నాడు. రిజిస్ట్రేషన్ సమయానికి కొంత డబ్బులు అవసరమై శ్రీనివాస నగర్‌కు చెందిన వడ్డీవ్యాపారి వెన్నపూస జోసఫ్‌రెడ్డిని ఆశ్రయించాడు. అతని భాగస్వాములతో కలిసి మల్లమ్మ సెంటర్‌లో నిర్వహిస్తున్న వెంకట పద్మావతి ఫైనాన్స్ అండ్ చిట్‌ఫండ్ కార్యాలయం ద్వారా నగదు ఇచ్చి తాకట్టు కింద భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. దీంతో పాటు షూరిటీ కింద ఖాళీ చెక్కులు, నోట్లు తీసుకున్నాడు. తీసుకున్న డబ్బులు విడతల వారీగా వడ్డీతో సహా ఉస్మాన్ చెల్లించినప్పటికీ ఆస్తి తిరిగి రిజిస్ట్రేషన్ చేయకుండా జోసఫ్‌రెడ్డి కాలయాపన చేస్తూ వచ్చాడు. ఆస్తులు కాజేసే దురుద్దేశ్యంతో ముఖం చాటేసి తిరుగుతున్నాడు. ఈ క్రమంలో ఆర్మీ ఉద్యోగి ఉస్మాన్ మరి కొందరు వెళ్లి తమ ఆస్తి రిజిస్ట్రేషన్ చేయాలని నిలదీశారు. దీంతో అతనిపై జోసఫ్‌రెడ్డి, అతని బంధువు సుధాకర్‌రెడ్డిలు దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రాథమిక దర్యాప్తు అనంతరం కేసులో ప్రధాన నిందితుడైన జోసఫ్‌రెడ్డిను అరెస్ట్ చేయగా మరో నిందితుడు వెన్నపూస సుధాకర్‌రెడ్డిను త్వరలో అరెస్ట్ చేస్తామని సీఐ తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



చిలకలూరిపేట: స్థానిక ఎమ్మెల్యే జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో గురువారం మెగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ప్రత్తిపాటి గార్డెన్స్‌లో నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శంకర కంటి ఆసుపత్రి సిబ్బంది రోగులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపిక చేసిన వారికి కంటి చుక్కడాల ఆపరేషన్లు ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని పేర్కొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకుని పురపాలక సంఘ కార్యాలయ ప్రాంగణంలో పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నెల్లూరి సదాశివరావు, పలువురు టీడీపీ నాయకులు, మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పటిష్టతకు కృషిచేస్తాం

నియోజకవర్గ దివ్యాంగుల విభాగం, చేనేత విభాగ అధ్యక్షులు గంటా శ్రీనివాసరెడ్డి, గుండాల శ్రీనివాసరావు



ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డిని సన్మానించిన గుండాల శ్రీనివాసరావు, గ్రామ నాయకులు



ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డికి కృతజ్ఞతలు తెలియచేసిన గంటా శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట: తమ సేవలను గుర్తించి పార్టీ పదవులు ఇచ్చినందుకు బాధ్యతగా పనిచేస్తామని నియోజకవర్గ దివ్యాంగుల విభాగం, చేనేత విభాగ అధ్యక్షులు గంటా శ్రీనివాసరెడ్డి, గుండాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో వారిద్దరూ వేర్వేరుగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డిని కలిసి తమ నియమాకాలకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపి శాలువా కప్పి, పూలదండలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పార్టీ పటిష్టతకు కృషిచేసి నియోజకవర్గ ఎమ్మెల్యేగా డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గెలిపించుకొని ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకుంటామన్నారు. వారితోపాటు పార్టీ నాయకులు వెన్న శ్రీనివాసరెడ్డి, ఇసప్పాలెం గ్రామ నాయకులు కొండపల్లి చిన్నకోటయ్య, శివలింగం రవీంద్రబాబు, వావిలాల విజయ్‌శ్రీనివాసుజంగమ, పిన్నిబోయిన వెంకటేశ్వర్లు, జల్లి శ్రీనివాసరావు జంగమ, నీలూరి నరేంద్ర, కొండపల్లి శివ పాల్గొని నూతనంగా నియమితులైన ఇద్దరికీ శుభాకాంక్షలు తెలియచేశారు.

యోగాసనాలతో సంపూర్ణ ఆరోగ్యం

శావల్యాపురం: మానవ జీవితంలో ప్రతి ఒక్కరు యోగాసాలు చేయటం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాదికారి మాణ్యం రాధాకృష్ణన్ అన్నారు. గురువారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో యోగాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా యోగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోషకాహారంతో క్రమం తప్పకుండా యోగాసాలు వేయటం ప్రతి ఒక్కరు అలవరుచుకోవాలన్నారు. అనంతరం వివిధ రకాల యోగాసాలు వేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రావిపూడి రమ్య, సూపర్‌వైజర్లు అలవలపూడి ఏడుకొండలు, ఉమాదేవి, స్టాఫ్‌నర్సు ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

యోగా మాసోత్సవాల్లో పాల్గొనండి

వినుకొండ: ప్రభుత్వ ఆదేశాల మేరకు 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ మాసోత్సవాల్లో భాగంగా ఈ నెల 21 నుంచి జూన్ 21వ తేదీ వరకు నెల రోజుల పాటు లయోలా స్కూల్ నందు యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ యోగా కార్యక్రమాల్లో పాల్గొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. జూన్ 21వ తేదీన విశాఖ పట్టణంలో ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన యోగా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

జీవితంలో యోగా భాగం కావాలి

నరసరావుపేట ఈస్ట్: శారీరక, మానసిక ఆరోగ్యం కోసం యోగాను జీవితంలో భాగంగా చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో యోగ శిక్షణా శిబిరం నిర్వహించారు. డీఈఓ చంద్రకళతో పాటు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు యోగ శిక్షణలో పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలను నిర్లక్ష్యం చేయవద్దు



ప్లాస్టిక్ వ్యర్థాలపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

నూజెండ్ల: ప్లాస్టిక్ వ్యర్థాలలో ఉండే రసాయనాలు మానవ ఆరోగ్యానికి హానికరమని స్వచ్ఛభారత్ మండల రిసోర్స్ కో ఆర్డినేటర్ కంచర్ల సుబ్బరామయ్య అన్నారు. మండలంలోని తలార్లపల్లె గ్రామపంచాయితీ పరిధిలో గల గొల్లపాలెం గ్రామంలో వ్యర్థాల నిషేధంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కంచర్ల సుబ్బరామయ్య మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను వాడి ఎక్కడ పడితే అక్కడ పడవేయడం వలన నీటి కాలుష్యం, వాయు కాలుష్యం ఏర్పడి క్యాన్సర్ లాంటి ప్రమాదకరమైన వ్యాధుల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా పేపర్, జూట్, క్లాత్ సంచులను ఉపయోగించాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ మీసాల వెంకట శ్రీనివాస రావు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అగాహన

వినుకొండ : మండలంలోని నాగులవరం, గోకనకొండ గ్రామాల్లో ప్లాస్టిక్ నిషేధంపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో సుందరరెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడక వల్ల గాలి, నీరు, భూమి కలుషితమై మానవాళి భవిష్యత్‌పై ప్రభావం చూపుతుందన్నారు. ప్రతిఒక్కరూ ఒక మొక్కను నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలన్నారు. ప్లాస్టిక్ కాల్చడం వల్ల వచ్చే పొగను పీలిస్తే క్యాన్సర్ వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మిషన్ మండల కోఆర్డినేటర్ ప్రభాకరరావు, పంచాయతీ కార్యదర్శి సందీప్, ప్రజలు పాల్గొన్నారు.

31న మెగా జాబ్‌మేళా

వినుకొండ: పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిరుద్యోగ యువత కోసం మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి టి. తమ్మాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో మొత్తం 26 కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. 10, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ చదువుకున్న అభ్యర్థులు బయోడేటాతో సంబంధిత పత్రాలతో హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9951214919, 9100566581, 7702921219 నంబర్లను సంప్రదించాలన్నారు.

'ఉపాధి' పనులు నూరుశాతం పూర్తి చేయాలి

జిల్లా ఉపాధిహామీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సిద్ధా రామలింగమూర్తి

నూజెండ్ల: ఉపాధిహామీ పథకం అమలులో అలసత్వం తగదని, నిర్వహణలో లోపాలు సరిదిద్దు కోవాలని ప్రవర్తన మార్చుకోకపోతే చర్యలుంటాయని జిల్లా ఉపాధిహామీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సిద్ధా రామలింగమూర్తి హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో గురువారం సమీక్ష సమావేశం జరిగింది. గ్రామాల వారీగా కూలీల మస్టర్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి సిబ్బందికి సూచనలతో పాటు హెచ్చరికలు చేశారు. ఉపాధి కూలీల వద్ద నుంచి నగదు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నామని పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. పనులు జరుగుతున్న ప్రదేశాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ఏపీవో ఆంజనేయరాజును ఆదేశించారు. కూలీలకు వేతనాలు వేయడానికి బేరసారాలు జరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని నిర్ధారణ జరిగితే ఉపేక్షించేది లేదని, ఇదే చివరి హెచ్చరికగా తీసుకుని మండలంలో నూరుశాతం పనులు పారదర్శకంగా జరగాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడివో ఉమాదేవి, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.